

● 611 హెక్టార్లలో వరినాట్లు ముంపు

మూడు రోజుల నుంచి కురిసిన భారీవర్షాలకు జిల్లా వ్యాప్తంగా 611 హెక్టార్లలో వరి నాట్లు ముంపునకు గురైనట్లు వ్యవసాయశాఖ నిర్ధారించింది. జిల్లాలో 78,050 హెక్టార్లలో వరి ఎద, 1980 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయి. భారీవర్షాల కారణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు పంట నష్టంపై అంచనా వేశారు. వరి పంట 611హెక్టార్లు ముంపునకు గురైందని నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఐదు రోజులు కంటే ఎక్కువరోజులు నారు మునిగితే దెబ్బతినే అవకాశముందని.. నారు మడిలో నీటిని బయటకు తీసివేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో సూచించారు. ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేయాలని.. అలాగే ఒక గ్రాము కార్బెనిజమ్ పిచికారీ చేయాలని తెలిపారు.



ఛిద్రమైన శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డు



గోతులమయమైన టెక్కలి - తొలుసూరుపల్లి రోడ్డు

● రోడ్లన్నీ ఛిద్రం

శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు తీవ్రంగా పాడైంది. ఇప్పటికే గోతులతో ఉన్న రోడ్డులో వర్షపునీరు చేరి రాళ్లతేలి మరింత ఛిద్రంగా మారింది. గార, శ్రీకాకుళం, ఆమదాలవలస, బూర్జ, లావేరు, జి.సిగడాం, పొందూరు, ఎల్.ఎన్.పేట, జలుమూరు, టెక్కలి మండలాల్లోని పల్లెప్రాంతాల రోడ్లు దెబ్బతిన్నాయి.



సిద్ధిపేట వద్ద నీటమునిగిన వరినారు

అతలాకుతలం

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- నీటమునిగిన వేలాది ఎకరాలు
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వరదనీటిలో రైల్వే అండర్ టర్నల్
- ఛిద్రమైన రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం/ ఆమదాలవలస/ నరసన్నపేట/ టెక్కలి/ గార/ ఎల్.ఎన్.పేట)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా అతలాకుతలంగా మారింది. వంశధార, నాగావళి నదులలో నీటి ఉధృతి పెరిగింది. గెడ్డలు, వాగులు, చెరువుల్లో వరదనీరు చేరింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. రహదారులు ఛిద్రమయ్యాయి. మరోవైపు గాలుల బీభత్సానికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో జిల్లావాసులు ఇబ్బందులు పడ్డారు. నీటి మునిగిన వరినాట్లు చూసి.. రైతులు ఆవేదన చెందుతున్నారు.



గార : బందరువానిపేట వద్ద ముందుకొచ్చిన సముద్రం

● ముందుకొచ్చిన సముద్రం

వాయుగుండం కారణంగా కె.మత్స్యలేశం (కళింగపట్నం) పోర్టు వద్ద మూడో నెంబర్ స్థానిక ప్రమాద హెచ్చరిక జారీచేశారు. శనివారం బందరువానిపేట వద్ద సముద్రం అలలు ముందుకు రావడంతోపాటు ఎగసిపడ్డాయి. కళింగపట్టణం, బారువ, బందరువానిపేట, కొవ్వాడ తీరాల వద్ద సముద్రం కొన్ని మీటర్లు ముందుకువచ్చింది.దీంతో మత్స్యకారులు సురక్షిత ప్రాంతాల్లో వలలు, పడవలు, తెప్పలు భద్రపరిచారు.

శనివారం ఉధృతంగా వర్షాలు కురుస్తాయనే హెచ్చరికతో విద్యాసంస్థలకు సెలవు ఇచ్చేశారు. కాగా.. శనివారం ఆమదాలవలస, కవిటి మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఉదయం 11 గంటల తర్వాత వరుణుడు శాంతించడంతో జిల్లావాసులు ఊపిరి పీల్చుకున్నారు.

● ఆమదాలవలస మండలంలోని కనుగులవలస, తమ్మయ్యపేట, ముద్దాడపేట, కొర్లకోట, చీమలవలస, కొత్తవలస, తొగరాం, కలివరం గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ఉన్న వరిచేలు వరదనీటిలో మునిగాయి. శుక్రవారం రాత్రి 63 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆమదాలవలసలో రైల్వేఅండర్ టర్నల్ వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. 8వ వార్డులోని బీఆర్ నగరం జలదిగ్బంధమైంది. ఈ ప్రాంతంలో డ్రైనేజీలు, సీసీ రహదారులు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా.. తమకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● టెక్కలి పరిధిలో.. దుర్గగెడ్డ, మాలపేట గెడ్డ వెంబడి వరదనీరు మదనగోపాలసాగరం జలాశయంలోకి చేరుకుంది. టెక్కలి-తొలుసూరుపల్లి రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. మూడురోజుల పాటు కురిసిన వర్షాలు నేపథ్యంలో గూడేం, కూర్మనాథపురం, మాకువరం, బిర్లంగిపేట ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బూరగాం గ్రామానికి వెళ్లే వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. శనివారం రోజంతా విద్యుత్‌శాఖ సిబ్బంది శ్రమించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

● నరసన్నపేట మండలం మడపాం, దేవాది, మాకివలస, కంబకాయి, మామిడివలస, చిక్కాలవలస, సుందరాపురం ,పారొల్లి, తోటాడ, బాలసీమ, బసివలస, బొగిరివలస గ్రామాల్లో సుమారు 6వేల ఎకరాల్లో వరదనీరు చేరింది. శనివారం బొగిరివలసలో వరి పొలాలను ఏవో సునీత పరిశీలించారు. మడపాం వద్ద నీటి మునిగిన ఎద పొలాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించి.. పంటను రక్షించేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. నదీ తీరప్రాంత వాసులను తహసీల్దార్ కనకరావు అప్రమత్తం చేశారు.

● నరసన్నపేటలో బాడాం, చిక్కాలవలస రైల్వే అండర్ పాసేజ్ వంతెన వద్ద వరదనీరు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుందరాపురం, బాడాం, తోటాడ, కూర్మనాథపురం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జలుమూరు- నరసన్నపేట మండలాల గ్రామాలను అనుసంధానం చేసే చిక్కావలస అండర్ పాసేజ్‌లో వరదనీరు తరుచూ ఉంటుందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

● ఎల్.ఎన్.పేట మండలంలో శనివారం అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు మీదుగా ప్రవహించిన నీరు కోవిలాం కాలనీ వీధులగుండా ప్రవహించి ఇళ్లల్లోకి చేరింది. తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజి, ఎంపీడీవో జి.గిరిబాల స్పందించి రోడ్డుపై నుంచి నీరు రాకుండా.. జేసీబీతో మట్టిగట్టు వేయించారు. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

కెరటాల తాకిడికి మత్స్యకారుడి మృతి



లక్ష్మణ (ఫైల్)

ఎచ్చెర్ల, జూలై 20: ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం గ్రామానికి చెందిన సూరాడ లక్ష్మణ(43) శనివారం ఉదయం సముద్రపు ఒడ్డున గేలంతో చేపల వేటాడుతుండగా ప్రమాదవశాత్తూ కెరటాల తాకిడికి గురై మృతి చెందాడు. ఆ సమయంలో స్థానికులు ఆయనను రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. తుఫాన్ కారణంగా అలలు తాకిడి అధికంగా ఉండడంతో లక్ష్మణ చనిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. మృతుడికి భార్య పోలమ్మ, కుమార్తె కామేశ్వరి ఉన్నారు. లక్ష్మణ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్య పోలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఆమదాలవలస: కనుగులవలస వద్ద రైల్వే అండర్ టర్నల్ దుస్థితి



ఆమదాలవలస: తమ్మయ్యపేట వద్ద వరదనీటిలో మునిగిన పంట పొలాలు



నరసన్నపేట : మడపాం వద్ద నీటిలో మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు



టెక్కలి : కూర్మనాథపురం వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



ఎల్.ఎన్.పేట: రోడ్డుపైకి నీరు రాకుండా గట్టువేయిస్తున్న అధికారులు



ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జేసీగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

- సీఆర్డీఏకు నవీన్ బదిలీ
- టెక్కలి సబ్‌కలెక్టర్‌కు స్థానచలనం

శ్రీకాకుళం, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్ ఖాన్ నియమితులయ్యారు. ప్రస్తుత జేసీ మల్లారపు నవీన్‌ను సీఆర్డీఏ విభాగానికి బదిలీ చేశారు. ఆయనను అదనపు కమిషనర్‌గా నియమించారు. అలాగే టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను బదిలీపై ప్రభుత్వ ఆర్థికశాఖ ఉప కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు శనివారం రాత్రి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్.. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఈయన నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా, చింతూరు ఐటీడీఏ పీవోగా పనిచేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. తర్వాత పదోన్నతిపై ఏడాది కిందట అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. త్వరలో బదిలీపై జిల్లాకు జేసీగా రానున్నారు.

కౌలుకార్డులు దక్కేదెవరికి?

- ప్రారంభమైన జారీ ప్రక్రియ
- ఇప్పటివరకూ 7,108 మందికి పంపిణీ

(కంచిలి)



జిల్లాలో సాగు హక్కుదారుల పత్రాలు (సీసీఆర్‌సీ కార్డులు) జారీ ప్రక్రియ ప్రారంభమైంది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సభలు నిర్వహించి.. కౌలు రైతులను గుర్తించారు. వారి దరఖాస్తులు స్వీకరించి.. భూ యజమానులను ఒప్పించేలా అవగాహన సదస్సులు నిర్వహించారు. అర్హులైన కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేసేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 6.62 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 3.87 లక్షల ఎకరాల్లో వరి పండించేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇందులో 1.50లక్షలకుపైగా ఎకరాలను కౌలు రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 50వేల మంది కౌలు రైతులు ఉన్నట్టు అధికారుల ప్రాథమిక అంచనా. ఏటా వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో కౌలు రైతులు నష్టపోతున్నారు. బీమా పరిహారం, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు వారికి సక్రమంగా అందడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాగు హక్కుదారుల చట్టం-2019 ప్రకారం సాగుహక్కు పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. గత ఏడాది 7,816 మంది రైతులకు కార్డులు అందించింది. జిల్లాలో ఈ ఏడాది కనీసం పదివేల మందికి సీసీఆర్‌సీ కార్డులను జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. సీసీఆర్‌సీ కార్డుల జారీకి డాక్యుమెంట్లు ఇవ్వడం వల్ల భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో చాలామంది భూ యజమానులు ముందుకొస్తున్నారు. భూ యాజమాని అంగీకారంతోనే వీటిని ఇవ్వనుంది. ఈ మేరకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించి.. భూ యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఈ ఏడాది 9,450 మంది కౌలు రైతులకు కార్డులు అందజేయాలని లక్ష్యం నిర్ణయించారు. ఇప్పటి వరకూ 4,583 సీసీఆర్‌సీ, 2,525 ఎల్‌పీఎం కార్డులు మొత్తంగా.. 7,108 కార్డులు జారీ చేశారు. కొత్తకార్డులతో పాటు కార్డుల రెన్యూవల్‌పైనా అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో ఈ ఏడాది ఎంతమందికి కార్డులు దక్కుతాయనేది వేచిచూడాలి.

ప్రైవేటు ఒప్పందాలకే యజమానుల మొగ్గు!

గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీచేసే ప్రక్రియ 2019 వరకు సాగింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగు హక్కుదారుల చట్టం 2019 తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలురైతులు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమాని రాతపూర్వక అగ్రిమెంటు తీసుకోవాలి. దీనికి ఎక్కువ శాతం మంది భూ యజమానులు ససేమీరా అంటున్నారు. ఒకటి, రెండు ఎకరాల భూమి ఉన్నవారు స్థానిక రైతులకు కౌలుకి ఇచ్చి చాలామంది వలస వెళ్లిపోతున్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, అడంగల్ కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు రావడానికి ఇష్టపడడం లేదు. భూ యజమానులు అంగీకరించకపోవడంతో వారు కోరిన కౌలు చెల్లించేలా ప్రైవేటుగా ఒప్పందాలు కుదుర్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా, పత్రాలకు మాత్రం నోచుకోవడం లేదు. ప్రభుత్వమే హామీగా ఉండి పత్రాలు అందించేలా చూడాలని కౌలురైతులు కోరుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో 1,356 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే కౌలు రైతులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 2నుంచి గ్రామసభలు నిర్వహించి.. కౌలు రైతుల గుర్తింపునకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. భూ యాజమాని హక్కులకు భంగం కలగకుండా.. కౌలు రైతులకు 11 నెలలు కాలపరిమితికి గుర్తింపు కార్డులను జారీ చేయనుంది.

అర్హులందరికీ అందజేస్తాం

కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు జారీకి రైతు సేవా కేంద్రాల వారీగా వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా భూ యజమానులు, కౌలుదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఈ నెల 30వరకు సీసీఆర్‌సీ కార్డులు జారీ ప్రక్రియ కొనసాగుతుంది. నిర్దేశిత లక్ష్యాలకు మించి, అర్హులందరికీ సాగుహక్కు పత్రాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- కె. జగన్మోహన్‌రావు, ఏడీఏ, సోంపేట



సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణకు శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో నగరం జనసంద్రమైంది. భక్తులు ఏటా ఆషాఢమాసం శుక్లపక్ష చతుర్దశినాడు సింహగిరి ప్రదక్షిణ (సుమారు 32 కిలో మీటర్లు) ప్రారంభించి మరుసటిరోజు పౌర్ణమినాడు ముగిస్తుంటారు. ఇది కొన్ని సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది భక్తులు భారీగా తరలివచ్చారు. సింహాచలం దేవస్థాన అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం సాయంత్రం పూజలు చేసిన అనంతరం అప్పన్న పుష్పరథానికి జెండా ఊపడంతో సింహగిరి ప్రదక్షిణ ఉత్సవం లాంఛనంగా ప్రారంభమైంది. భక్తులు తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణకు ఉపక్రమించారు. ఉత్సవంలో ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు పది లక్షల మంది పాల్గొన్నట్టు అధికారుల ప్రాథమిక అంచనా.

- సింహాచలం(విశాఖపట్నం)

వివరాలు.. 7లో





నరకాసుర వధకై సమరం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డి.వి.వి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. శనివారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. పోలీసాఫీసర్‌గా ఆయన క్రౌర్యాన్ని పలికించిన తీరు ఆకట్టుకుంది. సూర్య పాత్రను నరకాసురుడితో పోల్చుతూ, అతన్ని ఎదుర్కోవడానికి వస్తున్న హీరో హీరోయిన్ల పాత్రలను శ్రీకృష్ణుడు, సత్యభామతో పోల్చిచూపడం ఆసక్తిని పెంచింది. ఆగస్టు 29న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: మురళీ జీ, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్

మాస్టర్స్ పట్టా అందుకున్న అనా కొణిదెల

స్నాతకోత్సవానికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆమెకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో శనివారం వైభవంగా జరిగిన స్నాతకోత్సవంలో ఆమె పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానంలో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భార్యతో కలిసి వెళ్లిన పవన్.. మాస్టర్స్ పట్టా పొందిన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అనా కొణిదెల రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్‌లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికి తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో ఉండగానే ఆమె మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో అనా మొదటి



మాస్టర్స్ డిగ్రీ సాధించారు. కాగా, పవన్ దంపతులు సింగపూర్ నుంచి నేడు విజయవాడ రానున్నారు.

- అమరావతి, (ఆంధ్రజ్యోతి)

కమిటీ కుర్రోళ్లు వస్తున్నారు



గ్రామీణ నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలబోతగా రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, త్రావ్య, విషిక తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. యదు వంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా నిహారికా కొణిదెల మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై వస్తున్న తొలి చిత్రమిది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆలోచనతో కొత్త నటీనటులతో ఈ సినిమా తీశాం. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహితులతో సెలబ్రేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుంద'ని చెప్పారు.

ఆగస్టు నుంచి ఆరంభం



'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డిజైనర్ నీరజ్ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 5 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. హైదరాబాద్‌లో 30 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: జ్ఞానశేఖర్ వీ.ఎస్, సంగీతం: థమన్ ఎస్.ఎస్.

కల్కి బృందానికి నోటీసులు



'కల్కి 2898 ఏ.డీ' మేకర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాలో నటించిన ప్రభాస్, అమితాబ్ బచ్చన్, ఇతర నటులతో పాటు మేకర్స్‌కు మాజీ కాంగ్రెస్ నాయకుడు, కల్కి ధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రసాద్ లీగల్ నోటీసులు పంపారు. "ఈ సినిమా భారతీయ ఇతిహాసాల్లోని విశ్వాసాలను దెబ్బతీసేలా ఉంది. ఇందులో హిందూ పురాణాల్లో ఉన్న విధంగా కాకుండా.. వాటిని వక్రీకరించారు. విష్ణుమూర్తి చివరి అవతారం 'కల్కి'ని పవిత్ర గ్రంథాలను కించపరిచేలా చిత్రీకరించారు. ఇది దేశంలో కోట్లాది సంఖ్యలో ఉన్న భక్తులను అయోమయానికి, గందరగోళానికి గురిచేసేలా ఉంది" అని అచార్య ప్రసాద్ ఈ నోటీసులో ఆరోపించారు.

ఆకట్టుకునే చిన్న కథ



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '35-చిన్న కథ కాదు'. గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహిస్తున్నాడు. హీరో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రంలో విశ్వదేవ్ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ప్రసాద్ అనే మధ్యతరగతి తండ్రి పాత్రలో విశ్వదేవ్ నటన ఆకట్టుకుంది. ఇది చిన్న కథ కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని మేకర్స్ తెలిపారు. వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటర్: టి.సి ప్రసన్న

మహిళలు మెచ్చిన పేకమేడలు



వినోద్ కిషన్, అనూషకృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేకమేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా అన్ని చోట్లా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం శనివారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "భావోద్వేగంతో నిండిన మంచి సినిమాను తీశారని చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారు" అని అన్నారు. "మంచి కంటెంట్ ఉన్న సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోసారి రుజువు చేసిన చిత్రమిది. ఈ సినిమా సక్సెస్ ఇలాంటి మరిన్ని సినిమాలు నిర్మించడానికి ఉత్సాహం ఇచ్చింది" అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ చక్కగా ఉంది. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని చెప్పారు. "ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని నిర్మాత పారమళ్ల లింగయ్య అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కొడగంటి వీక్షితవేణు, కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అచ్చెన్న

టెక్కలి: అల్పపీడన ప్రభావంతో తీరంలో సముద్రం అల్లకలోలంగా ఉంటుందని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం సమీపంలోని డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకు 193 కిలోమీటర్ల తీరం విస్తరించి ఉందని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వద్దన్నారు. మత్స్యకారుల భద్రతే ముఖ్యమన్నారు. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు, జిల్లా అధికారులకు సూచనలు చేశామన్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించినట్లు పేర్కొన్నారు.

వీర సైనికుడి కుటుంబానికి సాయం

● చెట్లతాండ్రలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆర్మీ అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్మీ అధికారులు

సంతబొమ్మాళి: జమ్మూలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన చెట్లతాండ్రకు చెందిన ఆర్మీ జవాన్ డొక్కరి రాజేష్ కుటుంబానికి తక్షణ సాయాన్ని ఆర్మీ అధికారులు శనివారం అందించారు. ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సెంటర్, గోపాలపూర్ నుంచి కల్నల్ ఏఎస్ బద్వాల్ ఆధ్వర్యంలో ఆర్మీ అధికారులు రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, ధైర్యంగా ఉండాలని రాజేష్ తల్లిదండ్రులను ఓదార్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య, టెక్కలి డీఎస్పీ బాల చందర్, జిల్లా మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, టెక్కలి మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు గొనప సోమేష్, మన్మథరావు, సర్పంచ్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోర్లు తీసేందుకు ఎందుకు అనుమతులివ్వడం లేదు

● కోటబొమ్మాళి మండల సమావేశంలో సభ్యులు

టెక్కలి: రైతులు తమ సొంత పొలాల్లో బోర్లు వేసుకునేందుకు ఎందుకు అనుమతివ్వడం లేదని చిన్నసాన ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్, తర్లిపేట సర్పంచ్ వాడరేవు శ్రీనివాస్ ప్రశ్నించారు. కోటబొమ్మాళి మండల పరిషత్ సమావేశం ఎంపీపీ రోణంకి ఉమ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోర్ల కోసం రైతులు దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా అధికారులు కొర్రీలు వేయడం తగదని, కాలయాపన వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో తొలగించిన క్షేత్ర సహాయకులు స్థానంలో కొత్త వారిని నియమించి పనులు కల్పించాలని పలువురు సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపీడీవో వై.పద్మజ, జడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

నరసన్నపేట: అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న 'శిక్షా సప్తాహ్' కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు అన్నారు. శనివారం హెచ్ఎంలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలు, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధిలో నిబద్ధతను తెలిపే కార్యక్రమమని, దీనిని చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఒక్కోరోజు ఒక్కో అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, శిక్షణ లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పలువురు హెచ్ఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

నందిగాం: గ్రామ సచివాలయాల సంక్షేమ విద్య సహాయకులకు పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగల తిరుపతిరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి మంత్రి అచ్చెన్నాయుడును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. వివిధ సంక్షేమ శాఖలు, విద్యాశాఖలు విలీన ప్రక్రియ చేపడితే, అందులోకి మమ్ములను తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించవచ్చని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కమిటీని వేసి తుది నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో వి.నరసయ్య, వై.చైతన్య, స్వరూప్, ప్రసాద్, అజీద్, రవివర్మ తదితరులున్నారు.

అవయవదానం ఆదర్శనీయం: మంత్రి

సంతబొమ్మాళి: గోవిందపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాసరావు (25) చనిపోతూ నలుగురికి ప్రాణం పోశాడని మంత్రి అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావు మృతి చెందడం బాధాకరమన్నారు. బిడ్డ అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

'స్త్రీనిధి'తో మహిళలకు ఆర్థిక భరోసా

మందస: రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ నిధితో మహిళలకు ఆర్థికభరోసా కల్పించడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. శనివారం మందసలో విలేకరులతో మాట్లాడుతూ.. స్త్రీనిధి రుణాలు రూ.8కోట్ల 30 లక్షలు ఈ ఆర్థిక సంవత్సరంలో 372 స్వయం సహాయక సంఘాల్లో 1198 డ్వాక్రా సంఘాలకు అందించి ప్రథమ స్థానంలో ఉందన్నారు. 2024-25 సంవత్సరానికి స్త్రీనిధి రుణాలు రూ.8 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటికే రూ.కోటి అందించామన్నారు.

ఏపీ గ్రానైట్ అసోసియేషన్‌లో పలువురికి స్థానం

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ గ్రానైట్ అసోసియేషన్ కార్యవర్గంలో జిల్లాకు చెందిన పలువురికి స్థానం లభించింది. పెంద్యాల మహేష్ (స్టోన్‌ప్లస్ గ్రానైట్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నుంచి ఉపాధ్యక్షులుగా కోత మురళీధర్, సుధాకర్ నారాయణస్వామి, సహాయ కార్యదర్శులుగా దొడ్డ మహేష్, డాక్టర్ వి.బాలరాజు, కో-ఆర్డినేషన్ ప్రతినిధిగా అల్లు నగేష్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు శుక్రవారం విజయవాడలో నిర్వహించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.

సంఘ పురోభివృద్ధికి జగన్ సేవలు శ్లాఘనీయం

నరసన్నపేట: కళింగ కోమటి సంఘ పురోభివృద్ధికి ఆ సంఘం మాజీ అధ్యక్షుడు పొట్నూరు జగన్ చేసిన సేవలు శ్లాఘనీయమని ఆ సంఘ నాయకులు జామి వెంకట్రావు, తంగుడు జోగారావు అన్నారు. శనివారం జగన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పట్నాన నాగేశ్వరరావు, పి.ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి లీజు స్థలం అప్పగింత

● ఎమ్మెల్యే శిరీష సమక్షంలో అంగీకార పత్రాన్ని తహసీల్దార్‌కు అందించిన శ్రీకాంత్



స్థలం పత్రాలు తహసీల్దార్‌కు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష, శ్రీకాంత్

పలాస: కేంద్రీయ విద్యాలయానికి అవసరమైన స్థలాన్ని టీడీపీ నేత దువ్వాడ శ్రీకాంత్ తాను లీజుకు తీసుకున్న స్థలాన్ని తిరిగి అప్పగిస్తూ సంబంధిత పత్రాలను ఎమ్మెల్యే గౌతు శిరీష సమక్షంలో అధికారులకు శనివారం అందించారు. వివరాలిలా ఉన్నాయి.. సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ వైసీపీ ప్రభుత్వ హయాంలో సూదికొండ వద్ద సర్వే నెంబర్ 51/1లో ఉన్న 3.560 హెక్టార్ల స్థలాన్ని పదేళ్ల పాటు గ్రావెల్ క్వారీకి లీజు అనుమతులను తీసుకున్నారు. కొంతమేర కంకర తవ్వి మిగిలినది యథాతథంగా ఉంచారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడం, పలాసకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. విద్యాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను రెవెన్యూ, విద్యాశాఖాధికారులు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో భవనాల నిర్మాణం చేపట్టేందుకు వీలుగా తనకు గతంలో కేటాయించిన స్థలాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ దువ్వాడ శ్రీకాంత్ లిఖితపూర్వకంగా అంగీకార పత్రాన్ని శనివారం తహసీల్దార్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడుకు అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.నిరంజన్, సర్వేయర్ వైవీగిరి, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పలాస: వర్షాలు కురుస్తున్నందున గిరిజన, మైదాన ప్రాంత గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యాధికారులు పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సేవలందించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున ఆయా ప్రాంతాలను గుర్తించి నేరుగా వెళ్లి వైద్యం అందించాలని సూచించారు. కుక్క, పాముకాటులకు ప్రజలు ఎక్కువగా గురవుతున్నారని, ఆయా మందులు అందుబాటులో ఉంచాలని, పాముకాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పాము కాట్లు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున వైద్య సేవలు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులను ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, గ్రామాల్లో పర్యటించి కిడ్నీ వ్యాధులను అరికట్టడానికి తగు సూచనలు చేయాలని ఆదేశించారు.

'సుజల స్రవంతి'కి నిధులు కేటాయించాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



జిల్లా రైతు సంఘం నూతన కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: ఉత్తరాంధ్ర సుజల స్రవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య కోరారు. శనివారం కాశీబుగ్గలో రైతు సంఘం సమావేశం నిర్వహించారు. పాలకుల నిర్లక్ష్యానికి ఉత్తరాంధ్ర వెనుకబాటుతనమే ఒక నిదర్శ నమని, అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం అభివృద్ధి చెందాల్సిన పరిస్థితి నెలకొంద న్నారు. జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బహూదా తదితర ప్రధాన నదులున్నప్పటికీ రైతులకు సాగు నీరందిడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేయాలని, రైతులకు అన్ని రకాల వ్యవసాయ రుణాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలపై 90 శాతం సబ్సిడీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు రూ.16 వేలు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మదనపల్లిలో జరగనున్న రైతు సంఘం సమావేశాలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. అనంతరం రైతు సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆ సంఘం కన్వీనర్‌గా చాపర వేణు గోపాల్, కోకన్వీనర్‌గా అయినింటి లోకనాథం, సభ్యులుగా ఎర్రంనాయుడు, శంకర రావు, లక్ష్మణ్‌రావు, సింహాచలం, రమణలను ఎన్నుకున్నారు.

క్షేత్రస్థాయి అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. శనివారం తహసీల్దార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను, పాఠశాలలను గుర్తించి ఆప్రదేశంలో నివసించేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు నీటిలో మునిగిన పంటల రక్షణపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఏవో సునీత, ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చర్యలు

నందిగాం: మహిళల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో 'భేటీ బచావో భేటీ పడావో'పై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో టి.రాజారావు, తహసీల్దార్ వి.పద్మావతి, ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు పి.అజయ్ కుమార్ కమిటీల ఏర్పాటుపై సూచనలిచ్చారు. ఏసీడీపీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** మహిళలు వేధింపులకు గురైతే వెంటనే ఇంటర్నల్ కంప్లంట్ సెల్ (ఐసీసీ)కు ఫిర్యాదు చేయాలని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో లావణ్య అన్నారు. శనివారం పోక్ చట్టం-2013పై శిక్షణ తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.సురేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో డి.తిరుమలరావు తదితరులుపాల్గొన్నారు.

అంకిత భావంతో వైద్యసేవలందించాలి

ఎల్.ఎన్.పేట: పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు సకాలం లో వైద్యసేవలందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ నోడల్ అధికారి జీవీ లక్ష్మి అన్నారు. లక్ష్మీనర్సుపేట పీహెచ్‌సీ పరిధి పెద్దకోట-1 సచివాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. గణాంకాధికారి వీఆర్ నాగేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం నర్సింగ్ అధికారి విశైలజ పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌తో పారదర్శకత

పాతపట్నం: సోషల్ ఆడిట్‌తో పారదర్శక ధ్రువీకరణ జరుగుతుందని ఉపాధి జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సోషల్ ఆడిట్ కోఆర్డినేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ రాధ, ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఏపీవో ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ నమోదు ప్రక్రియ

జలుమూరు: మండలంలోని కొన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం నుంచి 27వ తేదీ వరకు 5 రోజులు పాటు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి కొత్త ఆధార్ కార్డులు జారీ, బయోమెట్రిక్ అప్డేట్, చిరునామాలు మార్పు, తప్పు పడిన పేర్లు మార్పులు ప్రక్రియ చేపడుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వర్షప్రియకు చోటు



టెక్కలి: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ (ఈసీఈ) తృతీయ సంవత్సరం విద్యార్థిని బోటు వర్షప్రియకు స్థానం లభించిందని కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 17.15 నిమిషాల్లో పెన్సిల్ ముల్లుపై ఏ నుంచి జెడ్ వరకు 26 అంకెలను బ్లేడు సాయంతో చెక్కి, ఇండియా బుక్‌లో స్థానం పొందింద న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరదాగా సుద్దముక్కలు, పెన్సిళ్లపై బొమ్మలు వేసుకునే తనకు అరుదైన అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్షప్రియను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ అశోక్‌కుమార్, లలితాభవానీ, తల్లిదండ్రులు అభినందించారు.

సోనియాగాంధీని కలిసిన కృపారాణి



టెక్కలి: కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీని శనివారం న్యూఢిల్లీలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డాక్టర్ కిల్లి రామ్మోహనరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ రాష్ట్ర రాజకీయ విషయాలు చర్చించినట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పాతపట్నం: గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ వైఎస్‌వీవీ ప్రసాదరావు, ఎంపీడీవోకె రామకృష్ణ రాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు కూలినా వెంటనే తగుచర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండాలన్నారు.

బ్యారేజీలోని గుర్రపు డెక్కను తొలగించాలి

హిరమండలం: గొట్టా బ్యారేజీ ఎగువ ప్రాంతంలో నీటిపై పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. శనివారం గొట్టాబ్యారేజిని పరిశీలించారు. గుర్రపు డెక్క వల్ల కాలువల్లోకి నీటి ప్రవాహం తక్కువగా వస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.











సింహాచలంలో గిరిప్రదక్షిణకు తరలివచ్చిన భక్తజనం, తొలి పావంచా వద్ద స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తజన సంద్రం

● సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
● లక్షలాది మంది రాక
● ఉత్సవాలను ప్రారంభించిన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు
● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విశాఖపట్నం, సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఓం నమో నారసింహ. పాహిమాం..పాహిమాం..పాహి గోవిందా...గోవిందా!!. అంటూ భక్తుల నామస్మరణతో శనివారం సింహగిరి పులకించిపోయింది. గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం, అడవివరం ప్రాంతం జనసంద్రమైంది. ఉదయం వేలల్లో మొదలైన భక్తుల సంఖ్య సాయంత్రానికి లక్షలకు చేరుకుంది. ప్రదక్షిణ మార్గం జన ప్రవాహంతో కిక్కిరిసింది. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి చుట్టూ శనివారం లక్షలాది మంది భక్తులు ప్రదక్షిణలు చేశారు. జిల్లా కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన సమయం కంటే ముందుగానే వేలాది మంది భక్తులు ఉదయం ఎనిమిది గంటలకే సింహాచలం తొలి పావంచా వద్దకు చేరుకుని కొబ్బరికాయలుకొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అధికారులు నిర్ణయించిన సమయానికి అంటే సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలి పావంచా వద్దకు చేరుకున్నారు. పుష్పతేరులోని స్వామివారికి అర్చక స్వాములు పూజలు చేసి అశోక్ గజపతిరాజుకు తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి జెండాను ఊపి సింహగిరి ప్రదక్షిణకు అశోక్‌గజపతిరాజు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తేరుకు ముందుభాగాన దేవస్థానం అధికారులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సింహాచలం తొలి పావంచా వద్ద ప్రారంభమైన పుష్పతేరు (పూల రథం) పాత అడివివరం, హనుమంతువాక, జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం, గురుద్వారా, మురళీనగర్ కూడలి, ఎన్ఏడీ, గోపాలపట్నం బంక్, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం తొలిపావంచాకు చేరుకుంది. పూలరథాన్ని లక్షలాది మంది భక్తులు అనుసరించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రూపొందించి ప్రణాళికల ప్రకారం దేవస్థానం అధికారులు తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన 80 ఇనుప గడ్డర్లపై భక్తులు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలను కొట్టారు. వాటిని పోగు చేసుకునేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేక వాహనాలను, పనివార్లను వినియోగించారు. కొంతమంది భక్తులు సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని పలువురు భక్తులు రాత్రి తొమ్మిది గంటలకే తిరిగి తొలిపావంచాకు చేరుకున్నారు.

భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

తొలి పావంచా మొదలుకొని పాత అడివివరం, హనుమంతువాక, హెచ్‌బీ కాలనీ మీదుగా గోపాలపట్నం వరకూ భక్తులు నడిచే మార్గాల్లో సేవాసంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి అల్పాహారం, మజ్జిగ, బాదంపాలు, టీ, కాఫీ, తాగునీరు సరఫరా చేశాయి. అలసిపోయిన భక్తుల కాళ్లకు సత్యసాయి సేవా సంస్థల సిబ్బంది సుమారుగా వంద మంది ప్రత్యేకంగా తయారుచేసిన నూనెతో మర్దన చేసి సాంత్వన చేకూర్చారు. మానవ సేవే..మాధవ సేవ అనే మాటలను పూర్తిగా విశ్వసించి భక్తులకు సేవలు అందించారు.



పథకం ప్రకారమే ఇరికించారు

- బ్యాంకు సిబ్బందే నా కుమార్తె ఆత్మహత్యకు కారణం
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన స్వప్నప్రియ తల్లి
- మరోసారి తెరపైకి గార ఎస్‌బీఐలో బంగారం మాయం కేసు

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గార ఎస్‌బీఐలో కుదువ పెట్టిన బంగారం మాయం కేసు మరోసారి తెరమీదకు వచ్చింది. ఈ కేసులో తన కుటుంబాన్ని బ్యాంకు సిబ్బంది పథకం ప్రకారం ఇరికించారని స్వప్నప్రియ (బ్యాంకు డిప్యూటీ మేనేజర్) తల్లి ఉరిటి సరళ ఆరోపించారు. ఈ మేరకు ఈ నెల 13న జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. 'నా కుమార్తె స్వప్నప్రియ ఎస్‌బీఐ గార బ్రాంచ్‌లో 2022 నుంచి డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తుంది. తన భర్త నుంచి ఆమె విడాకులు తీసుకొని మాతోపాటు శ్రీకాకుళంలో ఉంటుంది. 2023 నవంబరు 20న విధులకు సెలవు పెట్టింది. 24న బ్యాంకులో ఖాతాదారులు కుదువ పెట్టిన బంగారం మాయమైనట్టు అసోసియేషన్ సభ్యుల ద్వారా స్వప్నప్రియకు తెలిసింది. 26న స్వప్నప్రియతో పాటు సిబ్బందితో బ్యాంకు ఆర్ఎం రాజు సమావేశం ఏర్పాటు చేశారు. అందరం డబ్బులు వేసుకుని నగలు విడిపిద్దామని చెప్పారు. ఇంతలోనే స్వప్నప్రియపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయించారు. బంగారు ఆభరణాలు కుదవ పెట్టిన శ్రీకాకుళంలోని ఓ ఫైనాన్స్ కంపెనీకి నా కొడుకు కిరణ్‌ను తోడుగా తీసుకుని ఆర్ఎం రాజు నవంబరు 27, 28 తేదీల్లో వెళ్లారు. బంగారాన్ని బ్యాంకుకు అప్పగించారు. ఆ తర్వాత బంగారం పోలేదని మీడియాకు చెప్పారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ పోయిందని చెప్పారు. తనను ఎవరో దారికాచి కొట్టారని జాయింట్ కస్టోడియన్ సురేష్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్వప్నప్రియే ఆభరణాలు కాజేసి కొట్టించిందని ప్రచారం చేశారు. సురేష్ తప్పుడు ఫిర్యాదు చేయడం, ఆర్ఎం రాజు మాకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో మనస్తాపం చెందిన నా కుమార్తె స్వప్నప్రియ నవంబరు 29న ఆత్మహత్య చేసుకుంది. దీంతో అప్పటి వరకు బంగారం పోలేదన్న ఆర్ఎం రాజు.. గార పోలీసు స్టేషన్లో ఏకపక్షంగా స్వప్నప్రియపై ఫిర్యాదు చేశాడు. నా కుమార్తె సెల్‌ఫోన్లో ఉన్న ఆధారాలను అప్పటి ఎస్పీ జీఆర్ రాధికకు నా కొడుకు కిరణ్‌తో కలిసి అందించాం. వాటిని తెచ్చిన నా కొడుకుపై కేసు పెట్టి జైలుకు పంపించారు. సమాజంలో మా గౌరవానికి భంగం కలిగించారు. పథకం ప్రకారం నా కుమార్తెపై తప్పును నెట్టి ఆత్మహత్య చేసుకునేందుకు బ్యాంకు సిబ్బంది కారణమయ్యారు. సాక్షులుగా ఉన్న అప్పటి ఉద్యోగులను అత్యవసరంగా మార్చడం వెనుక ఆర్ఎం రాజు పాత్ర ఉంది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలి.' అని సరళ ఫిర్యాదులో పేర్కొంది.

యువకుడి అదృశ్యం


చిన్నారావు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల గ్రామానికి చెందిన జరుగుళ్ల చిన్నారావు (23) అనే యువకుడు ఈ నెల 18వ తేదీ రాత్రి నుంచి కన్పించడం లేదని ఆయన తండ్రి రాజారావు స్థానిక శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐటీఐ చదివిన చిన్నారావు పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

కూలిన గోడ.. తప్పిన ప్రమాదం


కూలిన పెంకుటిల్లు గోడ

లావేరు: మండల కేంద్రం లావేరులో శుక్రవారం అర్ధరాత్రి పెంకుటిల్లు గోడ కూలి పెను ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రౌతు సీతారామయ్య కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా.. శుక్రవారం రాత్రి ఇంటి గోడ కూలిపోయింది. అప్పటికే ఇంట్లో రౌతు సీతారామయ్య, అతని భార్య రమణమ్మతో పాటు ముగ్గురు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ గోడ బయట వైపు కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర పరామర్శించారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం చేస్తానన్నారు.

మాణిక్యపురంలో ఒకటి..

కవిటి: మాణిక్యపురం గ్రామంలో దొళాయి పరమానందకు చెందిన ఇల్లు కూలింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిగోడలతో ఉన్న ఇల్లు కూలిపోయిందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న డీటీ రామచంద్ర, వీఆర్వో గిరిబాబు గ్రామానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

పిల్లల్లో అవగాహన కల్పించాలి

కలెక్టరేట్: మాదక ద్రవ్యాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు స్పష్టం చేశారు. పిల్లలో డ్రగ్స్ వాడకం నివారణకు కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతీ, యువకులు మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారని, దీనిని నివారించేందుకు తక్షణమే అందరూ దృఢ సంకల్పంతో పనిచేయాలన్నారు. సంక్షేమ అధికారులు వసతి గృహాల్లో పక్కా ప్రణాళికతో డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అన్ని శాఖలతో ఒక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిరోధంపై హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, థియేటర్లలో స్లైడ్స్ వేయాలని కోరారు. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో మాదక ద్రవ్యాల నిరోధంపై బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లకు పార్సిల్ సర్వీసులకు సంబంధించి ఇప్పటికే సూచనలు చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలను ఏఎస్పీ ప్రేమ్ కాజల్ వివరించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలను, హ్యాండ్ బుక్స్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ యు.శ్రీలక్ష్మి, వి.రమణమూర్తి, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీఈవో వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఆర్వో దుర్గారావు, ఏపీసీ జయప్రకాష్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 0-5 ఏళ్ల లోపు పిల్లలకు బాల ఆధార్ నమోదు, 5-7 ఏళ్ల వారు, 15-17 ఏళ్లలోపు వారు ఓరిజనల్ గుర్తింపు ధ్రువ పత్రాలతో ఆధార్ క్యాంపులకు వచ్చి బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని కోరారు.

సర్దార్ పటేల్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్: భారత హోమ్ మంత్రిత్వశాఖ ద్వారా 2024 సంవత్సరానికి గాను జాతీయ ఐక్యత, సమగ్రతకు స్ఫూర్తిదాయక సహకారాన్ని, సేవలను అందించిన ప్రముఖ వ్యక్తులు, సంస్థల నుంచి 'సర్దార్ పటేల్ జాతీయ సమైక్యతా అవార్డు'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ తెలియజేసినట్టు యువజన సర్వీసుల శాఖ సీఈవో బీవీ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, నమోదు చేసిన దరఖాస్తు ప్రతిని డౌన్‌లోడ్ చేసుకుని కలెక్టరేట్‌లో గల సెట్‌శ్రీ కార్యాలయంలో జూలై 2వ తేదీలోగా అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8341478815 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

దుకాణాల సముదాయాన్ని ప్రారంభించండి

ఆమదాలవలస: ప్రజల ప్రాణాలతో పురపాలక సంఘ అధికారులు చెలగాటమాడుతున్నారని సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో కూరగాయల మార్కెట్ కట్టి చాలా సంవత్సరాలు కావస్తున్నా.. నేటికీ ప్రారంభించకపోవడంతో సరికాదన్నారు. దీంతో కూరగాయల వ్యాపారులు వేరే గత్యంతరం లేక ప్రధాన రహదారిపైనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. దీనివల్ల రహదారిపై రద్దీ పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి తోడు కూరగాయల మార్కెట్ వద్ద అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి.. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కూరగాయల దుకాణాల సముదాయాన్ని ప్రారంభించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

విస్తారంగా వర్షాలు

- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- రోడ్లపై ప్రవహించిన నీరు
- ఇబ్బందులు పడిన ప్రజలు
- నష్టపోయిన రైతులు

జిల్లాలో గడచిన రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామాల్లోని పంట పొలాల్లోకి నీరు చేరి చెరువులను తలపించాయి. రోడ్లపై నీటి ప్రవాహంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరి ఎద, నాట్లు వేసిన పొలాల్లో నీరు నిలిచిపోవడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరుచేరి ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. చెరువుల్లోకి నీరు చేసి నిండుకుండలను తలపిస్తున్నాయి. చాలాచోట్ల రోడ్లు పాడైపోయాయి.

\- ఆంధ్రజ్యోతి బృందం


సోంపేట: పట్టణంలోని బాలికోన్నత పాఠశాల వద్ద..


సరుబుజ్జిలి: బుడ్డివలస వద్ద చెరువులా పంట పొలాలు


ఎల్ఎన్ పేట: కొవిలాం సమీపంలో నీట మునిగిన పంటపొలాలు


బూర్జ: కొల్లివలస-గుత్తావల్లి రహదారిపై ఇరుక్కుపోయిన మినీవ్యాన్


ఇచ్ఛాపురం: సంతపేట పంప్ హౌస్ వీధిలో..


వజ్రపుకొత్తూరు: అధ్వానంగా అక్కుపల్లి రోడ్డు


ఇచ్ఛాపురం: బాహుదానది వంతెనపై తేలిన రాళ్లు


నందిగాం: కారుతున్న ఎంఆర్‌సీ భవనం


హిరమండలం: జిల్లేడిపేట వద్ద నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు


జలుమూరు: గుగ్గిలి వద్ద నీట మునిగిన వరి పొలాలు


ఎచ్చెర్ల: వెంకటాపురం వెళ్లే రోడ్డు దుస్థితి


రణస్థలం: చినకొవ్వాడ పాఠశాల వద్ద చేరిన వర్షపు నీరు

డ్రగ్స్‌రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

కలెక్టరేట్: అందరి సహకారంతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల్లో మత్తుపదార్థాల నియంత్రణ చర్యలపై వివిధ శాఖల అధికారులతో డీఆర్వో ఎం.గణపతిరావు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మందుల షాపుల్లో, మద్యం షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, కమిటీలు వేసి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. డాక్యుమెంటరీలను రూపొందించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో బి.శాంతిశ్రీ, సీడబ్ల్యూసీ చైర్మన్ శ్రీలక్ష్మి, బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, సెబ్, ఎక్సైజ్, విద్యాశాఖ, ఆరోగ్య, మున్సిపల్, సమాచారశాఖ, రైల్వే, ఆర్టీసీ, అటవీశాఖ, తదితర శాఖల అధికారులు దతదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు.. మహిళల జీవనోపాధికి భరోసా

ఆమదాలవలస: స్త్రీనిధి రుణాలు మహిళల జీవనోపాధికి భరోసా కల్పిస్తుందని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలో ఉన్న రాధాకృష్ణాపురం స్వయంశక్తి సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలో ఐదు కోట్ల 26 లక్షల రూపాయలను మహిళలకు తమ జీవనోపాధి మెరుగుపర్చుకోవడానికి రుణాలు మంజూరు చేశామన్నారు. గ్రామ సంఘం ద్వారా తీసుకున్న సీఐఎఫ్ స్త్రీనిధి, ఉన్నతి రుణాలను తిరిగి చెల్లించినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. రుణాలు సక్రమంగా వినియోగించుకుని, తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. కార్య క్రమంలో వీవోఏ జయసుధా స్వయంశక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

లావేరు: ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన పార్టీ క్రియాశీలక వలంటీరు కాకర్ల బాబాజీ రెండు రోజుల్లో 100 మందికి పైగా సభ్యత్వ నమోదును చేపట్టి నియోజకవర్గంలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బాబాజీ మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి డాక్టర్ విశ్వక్సేన్, సీనియర్ నాయకులు కాంతిశ్రీ ఆయన్ని అభినందించారు. జనసేన పార్టీలో కష్టపడి పని చేసే జనసైనికులకు మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు.

కుక్కల దాడిలో గొర్రెలు, మేకలు మృతి



రణస్థలం: పున్నానపాలెం గ్రామం ఇప్పిలి రమణకు చెందిన 13 గొర్రెలు, రెండు మేకలు వీధి కుక్కల దాడికి చనిపోయాయి. సుమారు రూ.రెండు లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. గాయపడిన మేకలకు, గొర్రెలకు పశుసంవర్ధక శాఖ ఏడీ బి.దుర్గారావు, పశువైద్యులు బి.చంద్రశేఖర్, ఎ.రామ్‌కుమార్ చికిత్స అందించారు.

తెలగ కుల సంక్షేమానికి కృషి చేయాలి


ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: తెలగ కుల సంక్షేమానికి కృషి చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు పి.వెంకట రామారావు కోరారు. రామయ్యపుట్టుగలో శనివారం ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా కులాన్ని గుర్తించి సంక్షేమ ఫలాలను అందించాలని కోరారు. ఐ.లక్ష్మీనారాయణ, మిన్నారావు, రామకృష్ణ, రమణమూర్తి, చిరంజీవి, దుర్గారావు ఉన్నారు.

డాక్యుమెంటేషన్‌లో మార్పులకు అవకాశం

ఆమదాలవలస: సైనిక బోర్డు డాక్యుమెంటేషన్‌లో ఎటువంటి తప్పులు నమోదైనా వాటిని సరిచేసే అవకాశం వచ్చిందని, దీనిని మాజీ సైనికులు వినియోగించుకోవాలని జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశం ఆ నియోజకవర్గ అధ్యక్షుడు సూర అవతారం అధ్యక్షతన జరిగింది. పెన్షన్ పేమెంట్ అథారిటీ డాక్యుమెంటేషన్‌లో తప్పులు ఉంటే నేరుగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. పీపీవోలో త్వరలో స్పర్శ ద్వారా నమోదు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, బర్రి సంజీవరావు, కూన జగన్నాథం, బొడ్డేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా జనపాల

లావేరు: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా గుర్రాలపాలేం గ్రామానికి చెందిన మనజనం సేవాసంస్థ డైరెక్టర్ జనపాల గోవిందరావు ఎంపికైయ్యారు. ఈ ఎన్నికలు శనివారం విజయనగరంలో జరిగాయి. గోవిందరావు మాట్లాడుతూ.. ఇప్పటికే అంతరించి పోతున్న చెరువులు, భూగర్భ జలాలను పెంపొందించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ ఎంపికపై ఎమ్మెల్యే ఈశ్వరరావు, బీజేపీ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రిమ్స్‌లో పోక్సో బాధితులకు ప్రత్యేక గది

అరసవల్లి: బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు రిమ్స్ ఆసుపత్రిలో పోక్సో బాధితుల కోసం శనివారం ప్రత్యేక వైద్య పరీక్షల గదిని ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పార్వతి, ఆర్ఎంవో డాక్టర్ సుభాషిణి, డాక్టర్ పార్థసారథి చేతుల మీదుగా ప్రారంభించారు. కొత్తకోట శ్రీనివాస్, ఎం.వాసుదేవ కుమార్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ రక్షక చర్యలు చేపట్టండి

శ్రీకాకుళం రూరల్: తుఫాన్ అనంతరం చేపట్టాల్సిన రక్షక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎంపీడీవో ఎం.సతీష్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో సెక్రటరీలు, డీఈలతో సమీక్షించారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తుఫాన్ కారణంగా ఏ ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ మొబైల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 23 నుంచి 25 వరకు సింగుపురంలో 23, 24న రాగోలులో, 25న లంకాం, 26న భైరి, గూడేం, 27న అలికాం, తండేంవలస సచివాలయాల పరిధిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈవోపీఆర్డీ వి.ప్రకాష్‌రావు,సెక్రటరీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఈస్ట్రన్ పవర్' యాప్ ద్వారా విద్యుత్తు బిల్లులు చెల్లించాలి

అరసవల్లి: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) 'ఈస్ట్రన్ పవర్' మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని శ్రీకాకుళం సర్కిల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్ సర్వీసు నెంబరును నమోదు చేసుకుని, 'బిల్ పే' ఆప్షన్ ద్వారా బిల్లులను సులభంగా చెల్లించవచ్చన్నారు. 'మై యూసేజ్' యాప్ ద్వారా యూనిట్ల సంఖ్యను నమోదు చేసి బిల్లును లెక్కించుకోవచ్చని తెలిపారు. యాప్ ద్వారా ఆధార్ నెంబరుకు విద్యుత్తు సర్వీసును అనుసంధానం చేసుకోవడం ద్వారా విద్యుత్తు సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారులు బిల్లుల చెల్లింపుల్లో నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ వాడుకోవచ్చన్నారు.

పక్కా భవనాలకు నోచుకోక

- పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు


పాత తహసీల్దార్ కార్యాలయంలో ఒక గదిలో నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ కార్యాలయం


చిన్నపాటి గదిలో నిర్వహిస్తున్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం

గార: మండల వ్యవస్థ ఏర్పడి నాలుగు దశాబ్దాలు కావస్తున్నా నేటికి కూడా మండలంలో చాలా ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలకు నోచుకోలేదు. దీంతో పరాయి పంచనే ఉంటూ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మండలంలో ఎక్కువగా రైతులే ఉన్నారు. వారికి ఎంతో ముఖ్యమైన వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం నిర్మాణం లేక అద్దె భవనంలోనే కొనసాగుతోంది. దీంతోపాటు ఆర్‌అండ్‌బీ ఏఈ, వెలుగు తదితర శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇరుకుగా ఉండే చిన్న చిన్న గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. నిత్యమూ వివిధ పనుల కోసం వచ్చేవారు కొంత ఇబ్బంది పడాల్సివస్తుంది. పాత తహసీల్దార్ కార్యాలయం లోని ఒక గదిలో వ్యవసాయ శాఖ కార్యాల యం, మరో గదిలో ఆర్‌అండ్‌బీ ఏఈ కార్యాల యం, పాత సమితి భవనంలో వెలుగు కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం ఈ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శిలాఫలకంతో సరి


అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు వేసిన శిలా ఫలకం

వెలుగు కార్యాలయం నిర్మాణం కోసం రూ.25 లక్షల వ్యయంతో 2011 సెప్టెంబరు 18న అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాత సమితి కార్యాలయం పక్కనే భూమి పూజ చేశారు. ఈ భవనం కింది భాగంలో వెలుగు కార్యాలయం, మొదటి అంతస్తులో ఉపాధి పథకం కార్యాలయం నిర్వహణకు డిజైన్ చేశారు. అయితే ఈ స్థలం తమ శాఖ పరిధిలో ఉన్నందున ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని కేంద్ర పురావస్తుశాఖ అధికారులు అడ్డు చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం అవసరమైన స్థలం కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పాత సమితి కార్యాలయంలోని ఓ ఒక గదిలో వెలుగు కార్యాలయం నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 46 గ్రామ సంఘాలు, 2270 స్వయం సహాయక సంఘాలు, వీటి పరిధిలో 26,000 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాలు సభ్యులు తరచూ సమావేశాలు, అధికారుల సమావేశాలు నిర్వహణకు పూర్తిస్థాయిలో వసతి చాలక ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఉపాధి పథకం కార్యాలయాన్ని ఇటీవల నూతనంగా నిర్మించిన కొత్త మండల పరిషత్ కార్యాలయం భవనంలోకి మార్పు చేశారు. ఇప్పటికైనా ఎంతో ముఖ్యమైన వెలుగు కార్యాలయానికి పూర్తిస్థాయిలో కొత్త భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని మహిళా సంఘ సభ్యులు కోరుతున్నారు.